క్లుప్తంగా

అనాథ పిల్లలకు బ్యాగ్‌లు, పండ్లు పంపిణీ



తెనాలిఅర్బన్: లూక్ కల్చరల్ మీడియా లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మారీసుపేటలోని గుడ్ న్యూస్ సర్వీస్ సొసైటీ హాస్టల్‌లోని అనాథ పిల్లలకు శనివారం రాత్రి బ్యాగ్‌లు, పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు కరుణాకర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వహీదా, కాటయ్య, ప్రసన్న, ప్రవీణ, సస్య, మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



తెనాలిఅర్బన్: అగాపే లవ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దేవా, మైఖేల్ పుట్టిన రోజులను పురస్కరించుకుని కేఎస్‌ఎంహెచ్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అవసరమైన ప్యాడ్స్, జామెట్రీ బాక్స్, లాంగ్ స్కేల్, పెన్నులను ఆదివారం సుందరయ్యనగర్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కతెవరపు పుల్లయ్య, ఆర్.పవన్, బుల్లా శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నేటితో పింఛన్ల పంపిణీ ముగింపు



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో సామాజిక పింఛన్ల పంపిణీ ఆదివారం కొనసాగింది. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వీటిని పంపిణీ చేశారు. అందుబాటులో లేనివారికి సోమవారం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సోమవారంతో పంపిణీ ప్రక్రియ ముగుస్తుందన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి



తాడేపల్లిరూరల్ : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి, 8 మందిని అరెస్ట్ చేసిన ఘటన తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి గ్రామంలోని ఓ నివాసంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు.. ఎస్ఐ ఖాజావలి తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారని తెలిపారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 54,130ల నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డ్స్, టోకెన్లు, ఐదు వాహనాలను స్వాధీనం చే సుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమో దు చేసి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు గంజాయిని నియంత్రించేందుకు టీమ్‌లు ఏర్పాటు చేశామని తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు తెలిపారు. పాత నేరస్తులు వివిధ కేసుల నిమిత్తం 20 మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, నిర్భయంగా వివరాలు తెలియజేయాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారి కోసం ప్రత్యేకంగా ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు రూరల్ పరిధిలోని రిమోట్ ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. బయటి వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాల నియంత్రణకు డ్రోన్‌లు

మంగళగిరి: నేరాల నియంత్రణకు డ్రోన్‌లు వినియోగిస్తున్నామని మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. ఇప్పటికే డ్రోన్‌ల వినియోగంపై కొంతమంది కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని కాజ టోల్‌గేటు వద్ద ఆదివారం డ్రోన్‌ను ఉపయోగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నేరాల నియంత్రణకు డ్రోన్‌లు క్రియాశీలకంగా మారనున్నాయన్నారు. ఓపెన్ డ్రింకింగ్, గంజాయి, పేకాట, కోడి పందేల నియంత్రణ, క్రౌడ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, బందోబస్తులో డ్రోన్‌లను వినియోగిస్తామని పేర్కొన్నారు. డ్రోన్‌లు ఉపయోగించి అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రదేశాలను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

ఇంద్రజాల 'జాదూ టైగర్'

- తూనుగుంట్ల రామలింగేశ్వరరావుది తెనాలే
- మ్యాజిక్ ప్రదర్శనలతో అంతర్జాతీయ కీర్తి
- 1972 నుంచి ప్రదర్శనలు



తూనుగుంట్ల రామలింగేశ్వరరావు

తెనాలి: కొన్నేళ్ల క్రితం.. పట్టణ బుర్రిపాలెంరోడ్డు.. ఇరువైపులా ఇసుకేస్తే రాలనంత జనం. ఒకపక్కగా పట్టణ ప్రముఖులు.. అంతలోనే ఎత్తుగా ఉన్న వ్యక్తి ప్రత్యేకమైన ఆహార్యంతో అక్కడకు చేరుకున్నాడు. అక్కడున్న పెద్దలు అతడి కళ్లకు గంతలు కట్టారు. ఏమాత్రం కనిపించటానికి వీల్లేని విధంగా ముందుగా నల్లని వస్త్రం, దానిపైన ఇసుకను ఉంచి గంతలు కట్టారు. ఆ వెంటనే అతడు స్కూటరుపై బయలుదేరి గాంధీచౌక్ వరకు వెళ్లి, మళ్లీ బయలుదేరిన చోటుకు వచ్చాడు. ఉత్కంఠగా చూస్తున్న జనం కరతాళధ్వనులతో ఆ ప్రాంతం హోరెత్తింది.

అతడు పట్టణానికి చెందిన ఒకే ఒక ఇంద్రజాలికుడు తూనుగుంట్ల రామలింగేశ్వరరావు. బహిరంగ ప్రదేశంలో కళ్లకు గంతలు కట్టుకుని స్కూటర్ నడపటం మాత్రమే కాదు.. ప్రదర్శనా వేదికలపై తన ఇంద్రజాలంతో ప్రేక్షకులను మైమరిపిస్తారు. మనిషి తలపై కాఫీ కాయటం, గాలిలో మనిషిని నిలబెట్టటం, ఖాళీ డబ్బా నుంచి డజను సీసాలను బయటకు తీయటం, నోటిలోంచి రంగురంగుల కాగితాలను రప్పించటం, సాధారణ వస్త్రాన్ని గట్టి కర్రగా మార్చటం.. వంటి విన్యాసాలెన్నో ప్రదర్శించేవారు. తన ఇంద్రజాల ప్రతిభతో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపును తెచ్చుకున్నారు. తన పేరుకు ముందు 'జాదూ టైగర్' బిరుదు వచ్చి చేరింది. ఒడిశా రాష్ట్రం పూరీలో గత వారం జరిగిన జాతీయ ఇంద్రజాల ఉత్సవంలో ప్రత్యేక సత్కారాన్నీ అందుకున్నారు.

తెనాలికి చెందిన రామలింగేశ్వరరావు వ్యాపార కుటుంబానికి చెందిన వారు. తల్లిదండ్రులకు ఏకైక సంతానం. చిన్నతనం నుంచీ మ్యాజిక్ అంటే ఆసక్తి.



ఒడిశా రాష్ట్రం పూరీలో జాతీయ ఇంద్రజాల ఉత్సవంలో రామలింగేశ్వరరావుకు సత్కారం

రకరకాల మ్యాజిక్‌లు చేసేవారు. తోటి స్నేహితులు అభినందించటంతో అదే ప్రవృత్తిగా మారింది. తనకు గల అభిరుచిని సార్థకం చేసుకునేందుకు ప్రముఖ ఇంద్రజాలికుడు ఎం.హుస్సేన్ దగ్గర శిష్యరికం చేశారు. గురువు నేర్పిన విద్యను కఠోరంగా సాధన చేశారు. తనపై తనకు నమ్మకం కలిగాక 1972 నుంచి స్వయంగా ఇంద్రజాల ప్రదర్శనలు ఇవ్వటం ఆరంభించారు. క్రమంగా ప్రజల ఆదరణను పొందారు. 1976లో అప్పటి రాష్ట్ర గవర్నర్ మోహన్‌లాల్ సుగాడియా సమక్షంలో రాజ్‌భవన్‌లో తన ఇంద్రజాల విద్యను ప్రదర్శించారు. ఆయన చేతులమీదుగా 'జాదూ టైగర్' బిరుదును స్వీకరించారు. తన ఇంద్రజాల కళతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పట్టణాలు, నగరాల్లో రామలింగేశ్వరరావు, వేలాది వేదికలపై తన విద్యను ప్రదర్శించారు. కళ్లకు గంతలు కట్టుకుని స్కూటర్‌ను నడిపే కళలో ఆరితేరిన రామలింగేశ్వరరావు అలాంటి ప్రదర్శనలు వేలల్లో చేశారు.

తెనాలి నుంచి తిరుమలకు తలకు ముసుగుతో చేసిన ప్రయాణం అప్పట్లో సంచలనం. ఆ విధంగా



కర్ర కొన ఆధారంగా గాలిలో బాలిక

రెండు పర్యాయాలు తిరుమల యాత్ర చేసిన గుర్తింపును పొందారు. 1985లో భువనేశ్వర్‌లో జరిగిన అఖిల భారత ఇంద్రజాల ఉత్సవం, 1986లో కోల్‌కతాలో ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు కె.లాల్ ఆధ్వర్యంలో జరిగిన మ్యాజిక్ కాంగ్రెస్‌లోనూ రామలింగేశ్వరరావు తన ప్రతిభను ప్రదర్శించారు. అప్పట్లో కె.లాల్ నుంచి పురస్కారాలను అందుకున్న అతికొద్ది ఇంద్రజాలికుల్లో రామలింగేశ్వరరావు ఒకరు. 2005లో కోల్‌కటాలోనే జరిగిన సార్క్ దేశాల 'జాదూ ఉత్సవ్'లో న్యాయనిర్ణేతల్లో ఒకరుగా వ్యవహరించారు.

ఇంద్రజాలానికి అవసరమైన పరికరాలను స్వయంగా తయారు చేసుకునేవారు. ఎందరో శిష్యులకు మార్గదర్శనం చేస్తూ వచ్చారు. కొన్నేళ్లుగా మలేషియాలో ప్రదర్శనలకు వెళ్లి వస్తున్నారు. పూరీలో జరిగిన జాతీయ ఇంద్రజాల ఉత్సవంలో తన ప్రతిభను మరోసారి చాటి, సత్కారాన్ని అందుకున్నారు. ఇంద్రజాలం కేవలం వినోదం కోసమేనని, పట్టుదలతో సాధన చేస్తే సాధించవచ్చని చెప్పారు. తన ప్రదర్శనల్లో కొన్ని ఆకు పసర్లు, రసాయనాలతోపాటు హస్తనైపుణ్యం, సెల్ఫ్ హిప్నాటిజం వంటివి ఉపయోగిస్తానని చెప్పారు. ఇందులో ఎలాంటి మాయలు, మంత్రాలు లేవని స్పష్టంచేశారు. ఇంద్రజాల విద్యకు ప్రభుత్వాల పరంగా ప్రోత్సాహం ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.



బాలికను గాలిలో పడుకోబెట్టిన ప్రదర్శన



వస్త్రాన్ని కర్రలాగ మార్చిన ప్రదర్శన

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

తెనాలిటౌన్: తెనాలి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీనియర్ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి సూచించారు. స్థానిక సుల్తానాబాద్‌లోని జేఎంజే కళాశాల ఎదుట కొత్తగా ఏర్పాటు చేసిన విజయశ్రీ హాస్పిటల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. 35 సంవత్సరాలుగా తెనాలి, పరిసర ప్రాంత ప్రజలకు సామాజిక సేవా దృక్పథంతో సేవలందిస్తున్న గార్లపాటి విజయ్‌బాబు విజయశ్రీ హాస్పిటల్ ద్వారా మరింతగా మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ కడియాల వెంకటరమణ, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ నన్నపనేని ప్రతాప్, డాక్టర్ పి.హదస్సా తదితరులు పాల్గొన్నారు.



హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీనియర్ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి

గ్రామంలో పోలీసు నిఘా పెంచండి

ఎస్ఐకు కొల్లిపర వాసుల వినతిపత్రం

కొల్లిపర: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వరుస చోరీలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో గ్రామీణులు భయాందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కొల్లిపర గ్రామస్తులు ఆదివారం ఎస్ఐ పి.కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. చోరీలు జరగకుండా రాత్రుళ్లు పోలీసుల నిఘా పెంచాలని కోరారు. గస్తీకి సిబ్బందిని నియమించాలని విన్నవించారు. దీంతో ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ తప్పకుండా చర్యలు చేపడతామని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో భీమవరపు సంజీవరెడ్డి, అవుతు బ్రహ్మానందరెడ్డి, ఉయ్యూరు బాలకృష్ణారెడ్డి, గుదిబండి శ్రీకాంత్‌రెడ్డి, బి.అవినాష్‌రెడ్డి, జి.శ్రీకాంత్‌రెడ్డి, ఎ.మహేంద్రారెడ్డి, బొంతు కిషోర్‌రెడ్డి, ఎ.శ్రీనువాసురెడ్డి, భీమవరపు కిషోర్‌రెడ్డి, బొమ్ము కోటిరెడ్డి, భీమవరపు శ్రీదర్‌రెడ్డి, అవుతు శశాంక్ రెడ్డి, కళ్లం నాగిరెడ్డి, కొల్లి సాంబిరెడ్డి, బొంతు చంద్రిక పాల్గొన్నారు.



రాత్రి వేళలలో నిఘా పెంచాలని ఎస్ఐ కోటేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న కొల్లిపర గ్రామ ప్రజలు

వక్ఫ్ చట్ట సవరణ బిల్లుతో అభద్రతా భావం

దుగ్గిరాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్ బిల్లుతో ముస్లిం సమాజంలో అభద్రత భావం ఏర్పడిందని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు ఎస్కే సుభానీ అన్నారు. ఆదివారం ముర్జా నగర్‌లో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వక్ఫ్ చట్టంపై ప్రభుత్వ చట్ట సవరణపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయన్నారు. తమ పూర్వీకులు కష్టజీతంతో కొంత మసీద్‌లు, మదర్సాలు, అనాథ ఆశ్రమాలు నిర్వహణకు ఆస్తులు దానం చేసినట్లు చెప్పారు. ఈ నూతన చట్ట సవరణ అమలులోకి వస్తే అవన్ని కోల్పోతామని, ఎన్‌డీఏ ప్రభుత్వం భాగస్వామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు ముస్లిం పెద్ద అన్నగా ఉంటానన్నా వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. మార్చి 10న జరిగే రెండు దఫా బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశ పెట్టనున్న ఈ బిల్లును ముస్లిం మనోభావాలను గౌరవించి టీడీపీ ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొన కూడదని తెలిపారు. సమావేశంలో మైనార్టీ నేతలు ఎస్కే రషీద్ సాహెబ్, ఎస్కే బాజీబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్కే సుభాని

నడవడికలో మార్పు రావాలి

రౌడీషీటర్లతో డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్: రౌడీషీటర్ల నడవడికలో తప్పనిసరిగా మంచి మార్పు కనబడాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని డీఎస్పీ బి.జనార్దనరావు హెచ్చరించారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ ఆదివారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించారు. పౌరుల బాధ్యతల గురించి, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ గురించి వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వివాదాలు, ఘర్షణలు, సెటిల్మెంట్లు వంటి అసాంఘిక కార్యకలాపాల్లో ప్రమేయం ఉన్నట్టు తెలిస్తే సహించబోమని స్పష్టం చేశారు. బుద్ధిగా మసలుకోకుంటే చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించేది లేదన్నారు. ప్రవర్తన మార్చుకోని వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రాత్రి వేళల్లో మద్యం సేవించి అలజడులు సృష్టించడం వంటివి చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అధికారులు ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రౌడీషీటర్లు ప్రతి ఆదివారం సంబంధిత స్టేషన్‌లో హాజరుకావాలన్నారు. రౌడీషీటర్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఇతర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడే వారిపై నగర బహిష్కరణ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి రౌడీషీటరుపై పోలీసు నిఘా ఉంటుందని, ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. డీఎస్పీ వెంట సీఐ ఎస్.రమేష్ బాబు ఉన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ జనార్దనరావు, సీఐ రమేష్‌బాబు

తెనాలిలో రామ పారాయణ మహా యజ్ఞం పూర్ణాహుతి

ఈనెల 9–14 తేదీల్లో టీజే హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహణ

తెనాలి: స్థానిక శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కేంద్రంగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞం పూర్ణాహుతి మహోత్సవం జరగనుంది. ఈనెల తొమ్మిదో తేదీ నుంచి ఆరురోజులపాటు జరిగే ఈవేడుకకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. 2022 డిసెంబరు 25న ప్రారంభించిన అష్టోత్తర శత కోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞంలో రాష్ట్రవ్యాప్తంగానూ, ఇతర రాష్ట్రాల్లోని భక్తులు పాల్గొన్నారు. పారాయణ పూర్తయిన నేపథ్యంలో కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ ప్రాంగణంలో వైఖానసాగమోక్తంగా పూర్ణాహుతి మహాయజ్ఞం తలపెట్టినట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఈనెల తొమ్మిదో తేదీ నుండి 14వ తేదీ వరకు జరిగే మహాయజ్ఞంలో ప్రతిరోజు విశేష హోమాలు, కల్యాణాలు, ఉచిత సామూహిక పూజలు, ఆధ్యాత్మిక వేత్తల ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన సేవాసమితి, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో భగవత్ రామానుజ దాసుడు సహకారంతో ఎంతో వైభవంగా జరిగే అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ పూర్ణాహుతి మహోత్సవంలో భక్త జనావళి విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బ్రోచర్ ఆవిష్కరణలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, ఆలయ ఈవో అవుతు శ్రీనివాస్ రెడ్డి, హరిప్రసాద్, వంశ పారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ,ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్ కుమార్, సభ్యులు జంజం రామారావు, ఉప్పల వరదరాజులు, మూర్తి వెంకటేశ్వరరావు, మడుపల్లి చంద్రశేఖర్ ,గుడివాడ బాలకృష్ణ, రొంపిచర్ల సురేష్, గుంటి వెంకట్, శ్రీరామ్ రాజేష్ బాబు, మాజేటి వెంకటేష్ ,కోట బద్రి నారాయణ , గోలి సోమశేఖర్, కె.రాజశేఖర్, కె.హరీష్ తదితరులు పాల్గొన్నారు



బ్రోచర్ ఆవిష్కరించిన ఈవో అవుతు శ్రీనివాసరావు, నిఖిల్ శాండిల్య ప్రభృతులు

ఇచ్చిన మాటలకు పొంతన లేని బడ్జెట్

ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి

తెనాలి: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్ రైతులకు మేలు చేసేలా లేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ధాన్యం, మిర్చి, కంది, శనగ పంటలకు ధరలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఇలాంటి నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు ధరల స్థిరీకరణకు సంబంధించి రూ.3 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.300 కోట్లు విదల్చటం ఏం సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇస్తుందని చెప్పి, ఇప్పుడు కేంద్రంతో కలిపి ఇస్తామనడం రైతాంగాన్ని మోసగించటం కాదా? అని ప్రశ్నించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే కౌలు రైతులకు నూతన చట్టం తీసుకురావాలని కోరారు. పంట రుణాలు, పరిహారం, పంటల బీమాపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

తాడికొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడతానని గుంటూరు జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు దాసరి రాజు అన్నారు. తనకు పదవి వచ్చినందుకు ఆదివారం తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చారని, తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఆయన వెంట నాయకులు షేక్ ఆదిల్, షేక్ మీర్జావలి, నూర్జహాన్, సాదిక్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకా

ఫిరంగిపురం: వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో ఆదివారం పశు వైద్యశాల సిబ్బంది ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి టీకా వేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నుదురుపాడులో పశువులకు టీకా వేసామని చెప్పారు. పశువైద్య సిబ్బంది పశువులు ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి వాటి వివరాలు నమోదు చేసుకొని టీకా వేస్తారని చెప్పారు. వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో 7 ఆవులు, 127 గేదెలకు టీకా వేసినట్లు చెప్పారు. ఆయన వెంట లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఆర్ .వినీల, సిబ్బంది ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తాడేపల్లిరూరల్: ఉండవల్లిలో ఫాల్గుణ మాసాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, గుంటూరు ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫాల్గుణ మాసం, హోళి పూర్ణిమ పండుగలను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సృష్టి ఆదిలోనే ఆకాశవాణిగా ఆదిత్యునికి బోధచేయబడినదే గీతా సారమని, తిరిగి ద్వారప యుగంలో భగవానుడైన శ్రీకృష్ణుడు భక్తుడైన అర్జునునికి గీతోపదేశం చేశాడని వివరించామని తెలిపారు. కమిటీ సభ్యులు బి.శివలింగం నాయక్, ఆర్. తిరుపతిరావు, హరిబాబు, సుబ్బారావు, శివ, అరుణ, దిల్‌షా, చంద్రగౌరీ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి టౌన్ : రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుండా మిగిలిపోతున్నాయన్నారు. ఆప్కాస్ విధానాన్ని తొలగించి కార్మికులను కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద, మార్చి 6న విజయవాడలో జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, నాయకులు రాచకొండ శివ, హరిబాబు, మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలోని పోలేరమ్మ గుడి వెనక భాగంలో పేకాట ఆడుతున్న వారిని ఆదివారం పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. సమాచారం మేరకు.. పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.11.530 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

• బీపచ్చమైన కంపు



జగ్గడిగుంటపాలెం వద్ద పంట కాలువ దుస్థితి



చెంచుపేట కోనేరు రోడ్డులో మురుగుకాల్వ ఇలా..

అటు పంట కాలువ, ఇటు మురుగు కాలువ దుర్గంధం వెదజల్లుతున్నాయి. తెనాలి మండలం, పట్టణంలోని కాలువల దుస్థితికి అద్దం పడుతున్నాయి. జగ్గడిగుంటపాలెం జగనన్న కాలనీకి వెళ్లే రహదారి వెంబడి ఉన్న పంట కాల్వ పచ్చని నాచుతో పేరుకుపోయింది. గ్రామంలోని మురుగునీరు పంట కాలువలోకి చేరడం వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి పంట కాలువను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే తెనాలి చెంచుపేట కోనేరు రోడ్డులో మురుగుకాలువ కంపు కొడుతోంది. పాచి పట్టి దోమలకు నిలయంగా మారింది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే కాలువను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– తెనాలిటౌన్/తెనాలిఅర్బన్

• వాహనదారి కష్టాలు



మారీసుపేట రెండు గేట్ల మధ్యలోని ఆర్‌ఆర్ నగర్‌కు వెళ్ళే దారి వద్ద మంచినీటి పైపులైన్ మరమ్మతులు చేసేందుకు మున్సిపల్ సిబ్బంది వారం రోజుల క్రితం రోడ్డును తవ్వారు. మరమ్మతులు పూర్తి చేసి గుంతలను మాత్రం పూడ్చలేదు. దీంతో రాత్రి వేళలో వాహనదారులు గుంతలో పడి గాయపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– తెనాలిఅర్బన్

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఉదయాన్నే భక్తులు కొండను ఎక్కి తల నీలాలు సమర్పించారు. అనంతరం కార్మెల్ మాత స్వరూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. దిగువ భాగంలోని ఆరోగ్యమాత స్వరూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.